ఇందిరమ్మ బీమా నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏఐ యుగంలో వాణిజ్య రంగ పరివర్తనపై ఒకరోజు కార్యశాల నిర్వహణ..



Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 325 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 18 నవంబర్ 2026

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు.. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పు
- ఈ నెలలోనే మూడో తుపాన్ ముప్పు.. 19 నాటికి తీవ్ర తుపాన్‌గా అక్వాన్



గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

● నామినేషన్ల సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలి.. భద్రత కోరుతూ వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం



ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

- అంతర్జాతీయ చట్టాల గౌరవానికి దేశాల పిలుపు..
సముద్ర భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారంపై సంయుక్త ప్రకటన





పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

- చేయూత పింఛన్లతో వృద్ధులు, నిరుపేదలకు అండ.. సత్తుపల్లిలో పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

సత్తుపల్లి,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెద్దలకు అండగా, పేదలకు తోడుగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని, సన్నబియ్యం పథకంతో పేదల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో మిగతా2లో...

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

- బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి..
త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ



హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం రాయ్‌పూర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, తెలంగాణకు కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 83 మీటర్ల కాగా, 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. భూసేకరణ, పరిహారం, పునరావాసానికి మిగతా2లో...

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

- కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ విమర్శలు..
మూడేండ్ల పాలనలో సాధించింది శూన్యమని వ్యాఖ్య



హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'లో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీనే అని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదని, ప్రజల పోరాటం, కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితమని పేర్కొన్నారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే ప్రభుత్వ సాధనగా అభివర్ణించారు.రాష్ట్రానికి మిగతా2లో...

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..
19న సిద్దిపేట సభలో దరఖాస్తు విడుదల



పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం



- అధికారుల మధ్య ఏకాభిప్రాయం..
పదోన్నతుల ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): పోలీసు అధికారుల పదోన్నతులకు సంబంధించి ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలపై ఉన్న అభ్యంతరాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నిర్ణయించారు.

మిగతా2లో...

రైతుల కష్టాలు పట్టవా?

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని ఇక్కట్లు
- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోళ్లు లేవు..
వేగవంతం చేయాలని హరీశ్‌రావు డిమాండ్



కల్వకుర్తి,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిగతా2లో...

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

మనీలా,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో కలిసి ముందుకు సాగాలని తూర్పు ఆసియా దేశాలు సంకల్పించాయి. మనీలాలో మంగళవారం ముగిసిన తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు అనంతరం 'స్థిరమైన భవిష్యత్తు, పునరుద్ధరణ కోసం కలిసి ముందుకు' అనే శీర్షికతో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సముద్ర భద్రత, వాణిజ్య ఆంక్షలు, పెరుగుతున్న ధరలు, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి కీలక అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చాయి.ఆసియాన్ దేశాలతో పాటు భారత్, అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. 1982లో కుదిరిన ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందాన్ని గౌరవించాలని నేతలు స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర వాణిజ్యం, నౌకాయానం, గగనతల ప్రయాణ స్వేచ్ఛను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.సముద్ర వనరులు, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సంరక్షణతో పాటు సముద్ర కాలుష్యం, వ్యర్థాల నివారణకు పరస్పర సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సముద్రగర్భంలోని కేబుళ్లు, పైప్‌లైన్లు, కీలక మౌలిక



సదుపాయాలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. **ధరల నియంత్రణకు వాణిజ్య మార్గాలు** నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో కొరత ఏర్పడకుండా వాణిజ్య మార్గాలను తెరిచి ఉంచాలని దేశాలు నిర్ణయించాయి. కీలక ఖనిజాలతో సహా సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునేలా అభివృద్ధి చేయాలని పేర్కొన్నాయి. వాణిజ్య సమస్యలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాయి. వాయు, భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానాన్ని విస్తరించడంతో పాటు ఇంధన రంగంలో సహకారాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చాయి.డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. ఆన్‌లైన్ మోసాలు, మనుషుల అక్రమ రవాణా, ఇంటర్నెట్ ద్వారా జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ వంటి నేరాలను అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నాయి. ముఖ్యంగా పిల్లలు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాయి.ఇంధన, ఆహార భద్రత, ఆరోగ్య వ్యవస్థల స్థిరత్వం, విపత్తుల సన్నద్ధత, సహాయక చర్యలు, వలస కార్మికుల రక్షణ వంటి అంశాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేయాలని నేతలు నిర్ణయించారు. **శాంతియుత ఇండో-పసిఫిక్ లక్ష్యం: మోదీ** శాంతియుతమైన, సుస్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో చర్చలు, దౌత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.**నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ** సమ్మక్క సాగర్ బ్యారేజీ ద్వారా ఎస్సారెస్పీ రెండో దశ కింద నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్పపాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించింది. బ్యారేజీకి అనుమతులు లభిస్తే ఈ ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరనుంది. **ముంపు తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతం మార్పు** సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. దీంతో ముంపును తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని అంచనా వేశారు. ఈ అధ్యయన నివేదికను ఐఐటీ ఖరగ్‌పూర్ జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.88 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే చెల్లించింది. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అనుమతుల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

హైదరాబాద్,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న వివిధ బీమా పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దరఖాస్తులను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ కొత్త పథకం అమలుతో నష్టపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.**మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి మానిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను రూ.40 వేల కోట్ల వ్యయంతో మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శకంగా 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామకాలు చేపట్టామని చెప్పారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన ఆసరా పింఛన్లను దీపావళి నాటికి అర్హులైన మహిళలు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కులవృత్తుల వారికి కొత్తగా మంజూరు చేశామని తెలిపారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం** కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో గత 33 నెలల్లో రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, కమిషనర్ కోండ్ర నరసింహ, ఎంపీడీవో రావెళ్ల చిన్న నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

నారాయణఖేడ్ పర్యటనలో భాగంగా నిజాంపేటలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని అన్నారు.

కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు.

సాగుకు సరిపడా విద్యుత్, నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, పండించిన పంటను కూడా సకాలంలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, బార్‌దాన్, గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించి కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

న్యూఢిల్లీ,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడుతుండటంతో మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికే అర్నాబ్, మురసు తుపాన్లు రాగా, తాజాగా మూడో తుపాన్ రానుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి 'అక్వాన్'గా నామకరణం చేశారు. సముద్రంలో మేఘాలు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలుగు రాష్ట్రాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఇన్‌సాట్-3డీఎస్, ఇన్‌సాట్-3డీఆర్ ఉపగ్రహ చిత్రాల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో భారీగా మేఘాలు ఏర్పడినట్లు గుర్తించారు. అక్వాన్ తుపాన్ నవంబర్ 19 నాటికి మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.**20న తీరం దాటే అవకాశం**ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించారు. తుపాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి అంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు** సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

అమరావతి,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):
రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని పోలీసులకు స్పష్టం చేసింది. భద్రత కోరుతూ అభ్యర్థులు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపిన వినతులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మండవ కిరణ్మయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు భద్రత కోరుతూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వి. సాయికుమార్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి, కొమ్మారెడ్డి దివాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కోర్టుకు తెలిపారు.ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని పిటిషనర్లు ఆరోపించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం.. ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగాలు తగ్గుతున్నాయని, భూముల ధరలు పడిపోతున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ నగరంలో నీటి కొరతకు నిదర్శనమని అన్నారు.22ఏ పేరుతో భూములను బ్లాక్ చేయడం, హైడ్రా పేరుతో కూల్చివేతలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింటోందని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లపై చర్యలు తీసుకుంటూ పెద్దల అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ నిర్వహించిన భారత్ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని, దానికి ఖర్చు చేసిన నిధులను ప్రజల అవసరాలకు వినియోగించి ఉంటే బాగుండేదని అన్నారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు తగిన సహాయం అందడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌ల సివిల్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పదోన్నతుల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సీనియారిటీ వివాదాలు, రోస్టర్ పాయింట్లు, ఖాళీలపై చర్చించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని డీజీపీ సూచించారు.**తొలిదశలో 54 అదనపు ఎస్పీ పోస్టులు** డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలిదశలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్యానల్ ఇయర్‌లో మరో 10 పోస్టులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.సీనియారిటీ, సర్వీసు కాలం, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పదోన్నతి జాబితాలను సిద్ధం చేశారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను వేగవంతం చేస్తానని డీజీపీ తెలిపారు. అర్హులైన అధికారులకు నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ వేళ ఉద్యోగులకు సెలవు

● 23 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 26న స్థానిక సెలవు.. గ్రామ పంచాయతీ ఎన్నికల రోజుల్లోనూ వెసులుబాటు

అమరావతి,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల 26న స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ సెలవు వర్తించనుంది.ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సెలవు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల పోలింగ్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా జరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం1881 ప్రకారం స్థానిక సెలవు ప్రకటించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది.సెలవు ప్రకటించడం సాధ్యం కాని చోట్ల ఉద్యోగులు ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది.

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ఏఐ యుగంలో వాణిజ్య రంగ పరివర్తనపై ఒకరోజు కార్యశాల నిర్వహణ..





హన్మకొండ, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ వాణిజ్య శాస్త్రం మరియు వ్యాపార నిర్వహణ శాస్త్ర విభాగం వారిచే నేడు ఒకరోజు కార్యశాల ఏఐ యుగంలో వాణిజ్యాన్ని పునర్ నిర్వచించడం – పింటెక్ ,డిజిటల్ వ్యాపారం మరియు పరిశ్రమల పరివర్తన "అనే అంశముపై నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు వివిధ యూపీఐ అప్లికేషన్స్ వినియోగం మరియు వస్తు సేవలు పొందడంలో, రోజువారి జీవనంలో సాంకేతికత వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ నీలిమకంజుల డీన్ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ , సిగ్మా యూనివర్సిటీ, వడోదర గుజరాత్ ముఖ్య వక్తగా అంశంపై ప్రసంగించినారు. వ్యాపార ప్రపంచ పరివర్తన అర్థం చేసుకోవడానికి నాలుగు అంశాలుగా అవగాహన చేసుకోవాలన్నారు. వినియోగదారుల మానసిక స్థితి విశ్లేషణ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం మరియు పారిశ్రామిక ప్రగతి 4.0, ఫైనాన్షియల్ టెక్నాలజీ వినియోగం వినియోగదారుల సంతృప్తి మరియు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగము, నైతికత మరియు షష్టేనేబిలిటీ గురించి వివరించారు. వ్యాపార సంస్థలు సాంకేతికతను. వినియోగిస్తున్నప్పటికీ పర్యావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ మరియు వ్యాపార సంస్థలు నైతికతతో ఉండాలని ప్రొఫెసర్ నీలిమ కంజుల గారు తెలియజేసినారు . .ప్రొఫెసర్ రాజశేఖర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు నూతన వ్యాపార పోగడలను, పరిశ్రమలో వస్తున్న మార్పులను పరిశీలించాలని తెలియజేసినారు. ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఏ. శ్రీనాథ్ మాట్లాడుతూ నేటి వ్యాపార ప్రపంచంలో కామర్స్ చదువుకున్న విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు కలవని వాటిని అందిపుచ్చుకోవాలని కోరినారు. శ్రీమతి రజనీలత వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ వాణిజ్య శాస్త్రాలను నూతన పోకడల పై కార్యశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యశాల నిర్వహించాల్సిన ఉద్దేశము గూర్చి వివరిస్తూ వాణిజశాస్త్ర విద్యార్థులు ప్రతిరోజు వ్యాపార ప్రపంచంలో వస్తున్న మార్పులను పరిశీలించాలని, వస్తు మార్పిడి విధానం నుండి నేటి వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యాపార ప్రపంచంలో తనదైన ప్రభావాన్ని చూపిస్తున్న కాలంలో విద్యార్థిని విద్యార్థులకు ఈ అంశంపై కార్యాశాల అవసరమని నిర్ణయించుకోవడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి రజనీలత, ప్రొఫెసర్ రాజశేఖర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ రవికుమార్ ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్ ,కార్యశాల ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్, వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపక బృందం డాక్టర్ శివ నాగ శ్రీను,డాక్టర్ బైరి శ్రీనివాస్ , డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ జి.కే. కుమార్ ,డాక్టర్ నవీన్, వినయ్ కుమార్, డాక్టర్ వందన, డాక్టర్ సునీత, బాలచందర్ ,మాధవ శంకర్ ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు

● ఏటూరునాగారం మండలంలో 463 మందికి మంజూరు పత్రాలు అందజేత.. మంత్రి సీతక్క



ములుగు జిల్లా, ఏటూరునాగారం, నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ఏటూరునాగారం గిరిజన భవన్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి నూతన పింఛన్ల మంజూరు ఉత్తర్వులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పరిశీలన అనంతరం సుమారు 3.5 లక్షల మంది మహిళలకు నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి పింఛన్లు రానివారు ఆందోళన చెందవద్దని, వారి దరఖాస్తులను మరోసారి పరిశీలిస్తామని చెప్పారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని అధికారులకు సూచించారు.ఏటూరునాగారం మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 463 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. వీటిలో ఏటూరునాగారంలో అత్యధికంగా 181 మందికి, చిన్నబోయినపల్లిలో 32 మందికి, కొండాయిలో 32 మందికి, కోయగూడ ఎల్లాపూర్‌లో 30 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.అనంతరం రూ.68.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన విద్యుత్ డివిజన్ కార్యాలయ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 19న ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీఆర్డీఓ చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి


- నవంబర్ 19 నుంచి శిబిరాలు.. అర్హులందరికీ రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందించాలి



ములుగు జిల్లా, నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్): అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. నవంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న బీమా నమోదు శిబిరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న కుటుంబ సంపాదన సభ్యుల్లో ఒకరికి ఈ పథకం వర్తిస్తుందని, వారి మరణం సంభవిస్తే కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందుతుందని తెలిపారు. నమోదు ప్రక్రియను డిసెంబర్ 18 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, రోజువారీ నమోదు లక్ష్యాలను నిర్దేశించి పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ల ధ్రువీకరణలో కచ్చితత్వం పాటించాలని, ముఖ్యంగా నామినీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. పూర్తి చేసిన దరఖాస్తులపై మాత్రమే సంతకాలు తీసుకోవాలని, పత్రాలను భద్రపరచాలని స్పష్టం చేశారు.శిబిరాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్నెట్, విద్యుత్‌తో పాటు తాగునీరు, కూర్చునే సదుపాయాలు కల్పించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన కుటుంబాలన్నీ నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్, సంపత్ రావు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టీ-సేవా కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

● రాష్ట్రవ్యాప్తంగా గ్రామం నుంచి నగరం వరకు కేంద్రాలు.. యువతకు స్వయం ఉపాధి అవకాశం



హైదరాబాద్, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):తెలంగాణ వ్యాప్తంగా టీ-సేవా స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, నగర స్థాయిల్లో కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కేంద్రాల ద్వారా 30కి పైగా ప్రభుత్వ సంబంధిత సేవలతో పాటు ఆధార్, పాన్, పాస్‌పోర్ట్, బ్యాంకింగ్, బీమా, టికెట్ బుకింగ్, బిల్లుల చెల్లింపులు తదితర సేవలు అందించవచ్చన్నారు. యువతకు 1,000కి పైగా నైపుణ్య శిక్షణ కోర్సులు, 500కు పైగా నైపుణ్య పరీక్షలు, సర్టిఫికేషన్లు, పోటీ పరీక్షల మాక్ టెస్టులు, ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్‌లకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.డిజిటల్ సేవలు, కంప్యూటర్ టైపింగ్, డాక్యుమెంటేషన్ తదితర సేవల ద్వారా కేంద్రాల నిర్వాహకులు స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు www.tsevaonline.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంప్రదించాల్సిన నంబర్: 8179955744

ఓట్ చోర్, నోట్ చోర్, సంపద చోర్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ 29న హైదరాబాద్‌లో ప్రజా గర్జన



● మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

జవహర్ నగర్ నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలు, ప్రజా సంపద దోపిడీకి వ్యతిరేకంగా, కేంద్రంలోని బీజేపీఆర్ఎస్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 29న హైదరాబాద్‌లో వేలాది మందితో 'ప్రజా గర్జన' ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది.బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని, ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దళితులు, ఆదివాసీలు, వలస కార్మికులు, ప్రభుత్వాన్ని విమర్శించే ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగిందని నాయకులు ఆరోపించారు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కోల్పోయిందని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.అదానీ, అంబానీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను కట్టబెడుతూ, నిరుద్యోగం, అధిక ధరలు, ప్రజల మౌలిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు.డిసెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాల్లో 16 డిమాండ్లతో ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రధాన డిమాండ్లు: ఎస్ఐఆర్‌ను రద్దు చేసి ఓటు చోరీని అరికట్టాలి; డీలిమిటేషన్, జమిలి ఎన్నికల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి; అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి ఎంఎస్పీ చట్టం అమలు చేయాలి; రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలను నెరవేర్చాలి; కరువు రైతులను ఆదుకోవాలి; కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులను పూర్తి చేసి ఇల్లందు, మహబూబాబాద్‌కు విస్తరించాలి; చౌక ధరల దుకాణాల ద్వారా 12 రకాల నిత్యావసరాలు పంపిణీ చేయాలి; పెన్షన్లు పెంచాలి.నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, బీడీ కార్మికుల జీవనభృతి పెంచాలి. కేజీబీవీ, ఆశా, అంగన్‌వాడీ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.40 వేలు ఇవ్వాలి. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా కల్పించాలి. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసి, ఉపాధి హామీని 250 రోజులకు పొడిగించి రోజువారీ వేతనం రూ.700 చెల్లించాలి.విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి ప్రైవేట్ కళాశాలల ఫీజులను నియంత్రించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఆసుపత్రి కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి. పేదలు, కౌలు రైతులకు పెన్షన్లు, వ్యవసాయ కార్మికులకు గుర్తింపు కార్డులు, జీవనభృతి కల్పించాలి. పోడు భూములకు పట్టాలివ్వాలి,


అసైన్డ్ భూముల ఆక్రమణలను అరికట్టాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచి ఖాళీలను భర్తీ చేయాలి. ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజులను నియంత్రించాలి. ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేసి ఎత్తివేయాలి.ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చల రంగయ్య, చంద్రన్న, కే.రమ, వి.ప్రభాకర్, ఎం.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ, గడ్డం సదానందం తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు

● జియాకోమో ఫిలిటెక్‌పై వీసా నిబంధనల ఉల్లంఘన కోణంలో విచారణ జరపాలని డిమాండ్



కరీంనగర్, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్2026లో విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిటెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.సమ్మిట్‌లో ఫిలిటెక్ "ఓట్ చోర్.. గద్దీ చోడ్" అనే రాజకీయ నినాదం చేయడం భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని బీజేపీ నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఏ కేటగిరీ వీసాపై భారత్‌కు వచ్చారు? సమ్మిట్‌లో చేసిన రాజకీయ ప్రసంగం వీసా నిబంధనలకు అనుగుణంగా ఉందా? అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు.ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్2025 కింద వీసా నిబంధనల ఉల్లంఘనపై దర్యాప్తు చేసి, సదస్సు నిర్వాహకులు, స్పాన్సర్లు, సమన్వయకర్తల బాధ్యతను కూడా పరిశీలించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుజ్జ శ్రీనివాసరావు, మాడ వెంకటరెడ్డి, పలువురు బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సగం సీజన్ ముగిసినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరా?

- బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



కరీంనగర్ నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లాలో సగం పైగా వరి కోతలు పూర్తయినప్పటికీ, ఇప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంపై బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలకు నేటికీ రైస్ మిల్లులను కేటాయించకపోవడం, ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడం చూస్తుంటే అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కయ్యారనే అనుమానం కలుగుతోందని ఆయన ధ్వజమెత్తారు.రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించాల్సిన అధికారులు, మిల్లుల కేటాయింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఖరీదు లేకపోవడంతో రైతుల నిస్సహాయతను మధ్య దళారులు ఆసరాగా చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర కంటే క్వింటాలుకు రెండు నుంచి మూడు వందల రూపాయల తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు.తక్షణం జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకునివిధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని, వెంటనే కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొత్తూరు(సి)లో సంక్షేమ జోరు..

- నూతన చేయూత లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ
- కొత్తూరు(సి)లో 25 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు





కురవి నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): పేద వితంతువులు, దివ్యాంగులు. కల్లుగీత కార్మికులు. ఒంటరి మహిళలు తదితర అర్హులైన వారికి తెలంగాణ ప్రభుత్వం చేయూత అందించాలనే ఉద్దేశంతో పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందని మహబుబాబాబాదు జిల్లా కురవి ఎంపీడీఓ వీరబాబు తెలిపారు. కురవి మండలం కొత్తూరు(సి) గ్రామానికి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను కురవి ఎంపీడీఓ కె.వీరబాబు, గ్రామ సర్పంచ్ బాదావతు చిన్ని సిరి నాయక్. కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్ లు కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వీరబాబు మాట్లాడుతూ ఈ నెల 19 న లబ్ధిదారుల ఖాతాలో పెన్షన్ డబ్బులు జమా అయితవని.ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.
అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ మంజూరు కాని వారు ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామ సర్పంచ్ బాదావతు చిన్ని సిరి నాయక్. బాలగాని శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ ప్రభుత్వ విప్.డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ గారి సహకారం తో కొత్తూరు(సి) గ్రామంలో 25 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని, వారికి మంజూరు పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత కలిగిన వారు ఎవరైనా ఉంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సర్పంచ్ సూచిం చారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దారోజి శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వేణు, వార్డు సభ్యులు పేరం శ్రీరాములు, కోంపెల్లి మల్లయ్య గౌడ్, జాటోతు సుజాత, జిల్లా మహిళా జనరల్ సెక్రెటరీ కొత్తపల్లి మేఘన, చిప్పరపల్లి మల్సూరు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు నిరాధారం

● కళాశాలలో సీసీటీవీ ఆధారంగా
నిష్పక్షపాత విచారణ జరపాలి: ఎమ్మార్పీఎస్ నాయకులు



కల్లూరు, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ వస్తున్న ఆరోపణలు నిరాధారమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు తూరిగంటి అంజయ్య ఖండించారు. మంగళవారం కళాశాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు.కళాశాలలో ఉపాధ్యాయుల సమయపాలన, విద్యార్థుల హాజరు, బోధన తీరుపై సమస్యలు ఉన్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయులను విధుల పట్ల బాధ్యతగా ఉండాలని ప్రిన్సిపాల్ కోరినందుకే ఆయనపై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై కళాశాల సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులను కోరారు.విచారణలో వాస్తవాలు వెలుగులోకి తీసుకొచ్చి విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలగకుండా కళాశాలలో ప్రశాంత వాతావరణం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లమందల ముత్తారావు, దారెల్లి వెంకటేశ్వర్లు, చాట్ల సునీల్ కుమార్, నందిగాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యలపై మండలిలో పోరాడుతా...





- నిరుద్యోగ యువత ఆశయ సాధనకు కృషి చేస్తా: ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్

ఖమ్మం, నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):పట్టభద్రుల గళమై మండలిలో వారి సమస్యలపై పోరాడతానని వరంగల్ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఖమ్మంలోని నాగార్జున ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని, పేదరికం నుంచి ఎదిగిన బహుజన బిడ్డగా పట్టభద్రుల ముందుకు వస్తున్నానని తెలిపారు. నిరుద్యోగుల సమస్యలు తనకు తెలుసని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణతో స్థానిక యువత ఉద్యోగావకాశాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అవకాశం కల్పిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, బహుజన వర్గానికి చెందిన అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించి తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు.సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనితా చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి వనం నాగేందర్, బానోతు కిషన్ నాయక్, వీరన్న, కర్లపూడి రఫీ, వీరభద్రం, రాజ్‌కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

- క్రీడాకారిణి నూరేన్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ అభినందన



కరీంనగర్ నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఇటీవల రజత పతకం సాధించిన కరీంనగర్ పట్టణం సవారణ్ స్ట్రీట్‌కు చెందిన నూరేన్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించి, ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి పోటీలలోనూ సత్తా చాటి పతకాలు సాధించాలని, తద్వారా కరీంనగర్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని నూరేన్‌కు సూచించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం నూరేన్ మాట్లాడుతూ.. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలలో 11 స్వర్ణ, 14 రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. వచ్చే నెలలో మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొనబోతున్నట్లు వెల్లడించారు. అథ్లెటిక్స్ విభాగంలో మరింత రాణించి, జిల్లాకు పేరు తీసుకురావడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు సమీపర్వేజ్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో 550 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు...





- లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ జిల్లా నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా: హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి గార్డెన్స్‌లో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన ప్రభుత్వంలో 4.68 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. చిగురుమామిడి మండలంలో ఇప్పటికే 6,700 పింఛన్లు ఉండగా, తాజాగా మరో 550 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పింఛన్లు తిరస్కరణకు గురైన వారికి మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని, ఈ నెల 19 నుంచి కొత్త పింఛన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 21న దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన సహాయక పరికరాలను ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- వేంసూరు మండలంలో 686 మందికి కొత్త చేయూత పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి











వేంసూరు, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): పేదల కష్టాలను తీర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. వేంసూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి లబ్ధిదారులకు కొత్త చేయూత పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వేంసూరు మండలంలో కొత్తగా 686 మందికి పింఛన్లు మంజూరు చేశామని, అర్హులైన మిగతా వారికి కూడా త్వరలో అందిస్తామని తెలిపారు. కొత్త పింఛన్లతో కలిపి మండలంలో ప్రతి నెలా రూ.1.48 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్, మహిళలకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 73 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని పేర్కొన్నారు.ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తోందన్నారు. కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ.. మండలంలో గతంలో 6,400 పింఛన్లు ఉండగా, అదనంగా సుమారు 680 మంజూరు చేసినట్లు తెలిపారు. వికలాంగులకు రూ.4,016, ఇతర అర్హులకు రూ.2,016 చొప్పున పింఛన్ అందుతుందని వివరించారు.ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. మొదటి విడతలో వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, కల్లుగీత, చేనేత కార్మికులకు పింఛన్లు అందించామని, త్వరలో వృద్ధాప్య పింఛన్లు కూడా మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విదేశీ నేత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

● భారత్ సమ్మిట్ ప్రసంగంపై సీపీ సునీల్ దత్‌కు బీజేపీ ఫిర్యాదు



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లో జరిగిన 'భారత్ సమ్మిట్2026'లో విదేశీ రాజకీయ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ ఖమ్మం జిల్లా శాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు.సమ్మిట్‌లో ఫిలిబెక్ "ఓట్ చోర్.. గద్దీ ఛోడ్" అంటూ భారత అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యలు చేశారని కోటేశ్వరరావు ఆరోపించారు. ఆయన ఏ కేటగిరీ వీసాపై భారత్‌కు వచ్చారు? పర్యటన ఉద్దేశం ఏమిటి? సదస్సుకు కేంద్ర హోం, విదేశాంగ శాఖల అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు.విదేశీ ప్రతినిధికి రాజకీయ ప్రసంగానికి అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులు, స్పాన్సర్లు, సమన్వయకర్తల పాత్రను కూడా పరిశీలించి, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కపిల్ బాల కుటీర్‌లో ఉత్సాహంగా బాలల దినోత్సవ వారోత్సవ ఆటల పోటీలు





కరీంనగర్ నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్):

బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని కపిల్ బాల కుటీర్‌లో పిల్లల కోసం వివిధ రకాల ఆటల పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఖో-ఖో, కబడ్డీ, డ్రాయింగ్ పోటీలు, చెస్ వ్యాసరచన వంటి పలు విభాగాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన పిల్లలకు, బాలల దినోత్సవ ముగింపు వారోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయనున్నట్లు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దుర్దన పర్వీన్ తెలియజేశారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో పలువురు ప్రముఖులు సిబ్బంది క్రియాశీలకంగా పాల్గొని సహకరించారు. వీరిలో: సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ ఇంచార్జీ వకుళ ,చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ శాంత సిబ్బంది శ్రీనివాస్, కృష్ణవేణి , రాము ,చైల్డ్ ప్రొటెక్షన్ సిబ్బంది స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థుల ఘన విజయం

- అత్యుత్తమ ప్రతిభతో 18 పతకాలు సాధించిన విద్యార్థులు





ఉప్పల్ నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ 5వ ఇన్విటేషనల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2026 పోటీల్లో బోడుప్పల్ లోని విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 18 పతకాలు సాధించారు. ఈ జాతీయ స్థాయి కరాటే పోటీలు 15 నవంబర్ 2026న కాకినాడ జిల్లా, ఇంద్రపాలెం జంక్షన్‌లో ఉన్న ద్రోణ బ్యాడ్మింటన్ అకాడమీ, లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ నిర్వహించింది. ఈ పోటీల్లో బి. సాత్విక్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకం, కె. శ్రీ విశ్వ కటా, కుమిటే విభాగాల్లో రెండు కాంస్య పతకాలు, కె. మణుదీప్ కటా విభాగంలో స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో రజత పతకం,శతాక్షి కటా, కుమిటే విభాగాల్లో 2 స్వర్ణ పతకాలు, ఎ. ఆద్య కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకం, హర్ష వర్ధన్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకం, జి. ప్రణీత్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో స్వర్ణ పతకం, బండారి అద్విత్ కటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకం జి. దినేష్ కటా విభాగంలో కాంస్య పతకం, కుమిటే విభాగంలో రజత పతకం సాధించారు. ఈ కార్యక్రమంలో కోచ్ జె. చేతన్, మాస్టర్ కె. ప్రసాద్ గౌడ్, ప్రెసిడెంట్, ఫౌండర్ ఆర్. మల్లికార్జున గౌడ్, ఆర్గనైజర్ డి. శంకర్ రావు (5వ డాన్, బ్లాక్ బెల్ట్), ఏపీ స్టేట్ ఇన్‌చార్జ్, చీఫ్ ప్యాట్రన్ సుమన్ తల్వార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం!

ఉప్పరిగూడెంలో 351 మందికి నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్



సీరోల్, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): అర్హులైన పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వారి జీవితాల్లో భరోసా నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకంలో భాగంగా సీరోల్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో నిర్వహించిన నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 351 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, అర్హులైన వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

డోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.351 మంది లబ్ధిదారులకు ఒకేసారి నూతన పెన్షన్ల మంజూరు పత్రాలు అందడంతో ఉప్పరిగూడెం గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ కార్యక్రమంలో సీరోల్ ఎంపీడీవో గౌస్, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ , సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ , వివిధ గ్రామాల గ్రామ సర్పంచులు మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు, పెన్షన్ లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్ అందజేస్తాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని 33 గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం మధురానగర్ లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే తో కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధర మండలంలోని 33 గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర మండలంలో 389 వితంతు, 26 వికలాంగుల, 101 గీత కార్మిక, 75 ఒంటరి మహిళ, 126 చేనేత పెన్షన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లోని అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్ అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఉచిత సన్నబియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రామ్, మండల సర్పంచులు మరియు అధికారులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన జెన్నారెడ్డి పద్మజ

- జెన్నారెడ్డి పద్మకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే యశస్వి రెడ్డి




తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన జెన్నారెడ్డి పద్మజ కు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ని మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా తనను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా అభివాదం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , జెన్నారెడ్డి పద్మజ కి అభినందనలు తెలియజేస్తూ, మహిళా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మహిళల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

తొర్రూరు మండలంలో 1162 మంది లబ్ధిదారులకు

పెన్షన్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే







తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 17(పిసిడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండల కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలో 304, 31 గ్రామపంచాయతీలలో 865 మంది నూతన పెన్షన్ దారులకు సోమవారం రామ ఉపేందర్ గార్డెన్ లో పెన్షన్ పత్రాలను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ గత పది సంవత్సరాల నుండి టిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్ దారులకు అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా పెన్షన్ అందుకున్న లబ్ధిదారుల ముఖాలలో కల కనపడుతుందని వారు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.కొత్త పెన్షన్ దారులు వచ్చే నెల నుండి పెన్షన్ తీసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తొర్రూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో 865 మంది లబ్ధిదారులు పెన్షన్ పత్రాలు అందుకోగా తొర్రూర్ లోని మున్సిపాలిటీ పరిధిలో గల పెన్షన్ లబ్ధిదారులు 304 మంది పత్రాలను అందుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తొర్రూర్ ఎస్ఐ మహేందర్ రెడ్డి, పోలీసుల బృందం పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్, కౌన్సిలర్లు, అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు, లబ్ధిదారులు గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు.. పేదలకు చేయూతనివ్వడం అభినందనీయం!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ ఊడుగుల వెంకన్న



సీరోల్, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): అర్హులైన పేదలకు కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వానికి, డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్‌కు చిలుకోయలపాడు గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సీరోల్ మండలం ఉప్పరగూడెం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్లో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు సర్పంచ్ ఊడుగుల వెంకన్న అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సహకారం, ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయని తెలిపారు.కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు ఈ పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి, తమ గ్రామ ప్రజల తరఫున మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని సర్పంచ్ ఊడుగుల వెంకన్న అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పింఛన్ లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

- పెండింగ్ కేసుల పరిష్కారం, సాంకేతికత వినియోగంపై సిబ్బందికి సూచనలు





తల్లాడ, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):తల్లాడ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్‌లో వస్తున్న ఆధునిక పద్ధతులపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ-సమన్లు, ఈ-సాక్ష్యా వంటి సాంకేతిక విధానాలను విస్తృతంగా వినియోగించాలని, దర్యాప్తులో పారదర్శకత పాటించాలని చెప్పారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారిపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారులు, పోలీస్ సిబ్బందితో మాట్లాడారు.

డోర్నకల్ నియోజకవర్గంలో సంక్షేమ సంబరం...!

- కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల్లో నూతన పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్






కురవి,నవంబర్ 17 (పీసీడబ్ల్యూ న్యూస్):పదేళ్లుగా పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూత అందించింది. డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల్లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కురవి మండల కేంద్రంలో 851 మంది, సీరోలు మండలంలోని ఉప్పరిగూడెంలో 351 మంది, డోర్నకల్ మండల కేంద్రంలో సుమారు 760 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీల అమలుతో పాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నూతన పెన్షన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు తమకు ప్రభుత్వం అండగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, కౌన్సిలర్లు, గ్రామస్థులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నెలవారీ పాస్‌లపై ప్రత్యేక రాయితీలు

● దూర పరిమితి లేకుండా ప్రయాణం.. అదనపు గడువు, మహిళలకు ప్రత్యేక సదుపాయం



సత్తుపల్లి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సత్తుపల్లి డిపో పరిధిలో నెలవారీ సీజన్ టికెట్లపై ప్రత్యేక రాయితీలు, సదుపాయాలు కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.దూర పరిమితి లేకుండా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేందుకు నెలవారీ సీజన్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ పాస్‌లు కలిగిన వారు కాంబినేషన్ టికెట్ ద్వారా డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చన్నారు.ఏదైనా నెలవారీ పాస్ ఉన్నవారికి సూపర్ లగ్జరీ, ఆపై తరగతి బస్సుల్లో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. రెండు నెలల పాస్‌పై అదనంగా ఐదు రోజులు, మూడు నెలల పాస్‌పై పది రోజుల వ్యాలిడిటీ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు 15 రోజుల చార్జీతో 30 రోజులు ప్రయాణించేలా ప్రత్యేక పాస్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.నెలవారీ సీజన్ టికెట్ కలిగిన వారు ఆదివారాల్లో నగర పరిధిలో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

సొంత గూటికోసం కలం యోధుల సమరశంఖం

● డిసెంబర్ 5 నుండి నిరాహార దీక్షలకు సిద్ధం ● టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :సమాజంలోని ప్రతి ఒక్కరి కష్టాలను, కన్నీళ్లను అక్షరాలుగా మలిచి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళి వారి కష్టాలను, కన్నీళ్లను తీర్చే జర్నలిస్టులు, నేడు తమ సొంత గూటి కల నెరవేర్చుకోవడానికి రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎండనక, వాననక నిరంతరం ప్రజల పక్షాన నిలబడే కలం యోధులకు తలదాచుకోవడానికి కనీసం గజం స్థలం కూడా లేకపోవడం అత్యంత బాధాకరం. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మరోసారి సమరశంఖం పూరించింది.మంగళవారం ఖమ్మం జిల్లా యూనియన్ కార్యాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. డిసెంబర్ 5 నుండి 9వ తేదీ వరకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని, అలాగే స్థానిక జిల్లా మంత్రులు సైతం అనేక వేదికలపై జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేరుస్తామని వాగ్దానాలు చేశారని వారు గుర్తుచేశారు. ఆ హామీలను తక్షణమే అమలు చేసి జర్నలిస్టుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం నాటికైనా ప్రభుత్వం స్పందించి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షలకు సైతం వెనుకాడబోమని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై ఇప్పటికే వివిధ రూపాలలో పోరాటాలు నిర్వహించిందని, దీనిలో భాగంగా ఇప్పటికే ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా చారిత్రాత్మక పాదయాత్ర నిర్వహించినా పాలకుల్లో చలనం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, అక్రిడిటేషన్ల మంజూరులో ఆరు నెలలైనా అర్హులైన జర్నలిస్టులలో కొందరికి ఇప్పటికీ అక్రిడిటేషన్లు ఇవ్వలేదని తెలిపారు. అక్రిడిటేషన్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందనే పేరుతో డీపీఆర్ఓ కార్యాలయ జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 23న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే టీడబ్ల్యూజెఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు కలెక్టర్ కు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీనిపై విచారణకు డిపిఆర్ఓ, జిల్లా సహకార అధికారికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడాన్ని ఖండించారు. ఈ విషయమై జిల్లా సహకార అధికారి, డిపిఆర్ఓ సంయుక్తంగా విచారణ చేపట్టి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఆత్మగౌరవం, మనుగడ కోసం జరుగుతున్న ఈ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అండగా నిలవాలని కోరారు.ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, టీబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, కోశాధికారి రంగు అయ్యప్ప, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్షులు తురగ రాజేంద్రమూర్తి, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ హర్షద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుపాటి మాధవరావు, జిల్లా ప్రచార కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, బంకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

- సభా ప్రాంగణం, భద్రత, ప్రజా సౌకర్యాలపై అధికారులకు సూచనలు



సిద్ధిపేట, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):ఈ నెల 19న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్ధిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మైనంపల్లి హనుమంతరావు తదితరులు పరిశీలించారు.సభా ప్రాంగణం, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం పోలీస్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై సీఎం పర్యటన, బహిరంగ సభ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఒక్క మెసేజ్‌తో విద్యార్థికి అత్యవసర వైద్యం..

సామాన్యుడి సమాచారానికీ తక్షణ స్పందన..

విద్యార్థికి అండగా రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్!

వాట్సాప్ సందేశంతో స్పందించి ఖమ్మంలో అత్యవసర ఆపరేషన్‌కు చొరవ..

ఆపదలో ఉన్న విద్యార్థికి అండగా నిలిచిన డాక్టర్ మట్టా దంపతులు.. తల్లిదండ్రుల కృతజ్ఞతలు





కల్లూరు, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): సాయం కోరిన స్వరం చిన్నదైనా.. స్పందించే మనసు గొప్పదై ఉండాలి అన్న మాటకు ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది. సామాన్యుడి నుంచి వచ్చిన ఒక్క వాట్సాప్ సందేశానికి స్పందించి, అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థికి అత్యవసర వైద్యసాయం అందేలా రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ చొరవ తీసుకున్నారు.కల్లూరు పట్టణంలోని తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అపెండిక్స్ సమస్యతో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుమారుడి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందిన తండ్రి, స్థానిక జర్నలిస్ట్ చెవుల నరేష్ ఈ విషయాన్ని వాట్సాప్ ద్వారా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.సమాచారం అందిన వెంటనే స్పందించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా విద్యార్థికి వైద్యసాయం అందేలా చర్యలు చేపట్టారు. ఖమ్మంలోని ప్రముఖ ఆసుపత్రిలో విద్యార్థికి అత్యవసర శస్త్రచికిత్స (ఆపరేషన్) జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లలో చొరవ చూపారు. సకాలంలో వైద్యసాయం అందడంతో విద్యార్థికి చికిత్స అందింది.సాధారణంగా ప్రజల నుంచి వచ్చే చిన్నచిన్న సమస్యలు సైతం కొన్నిసార్లు పరిష్కారానికి నోచుకోవడం కష్టమవుతున్న తరుణంలో, ఒక వాట్సాప్ సందేశానికి తక్షణమే స్పందించి విద్యార్థికి వైద్యసాయం అందేలా చొరవ తీసుకోవడం ఈ ఘటనలో ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రజల సమస్యల పట్ల స్పందన, ఆపద సమయంలో అందించే సహకారం ఎంతటి ప్రాధాన్యత కలిగినవో ఈ సంఘటన తెలియజేస్తోంది.తమ కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషయంలో ఆపద సమయంలో అండగా నిలిచి, అత్యవసర వైద్యసాయం అందేలా సహకరించిన రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌కు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కి విద్యార్థి తల్లిదండ్రులు చెవుల నరేష్, భూలక్ష్మి దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనపై పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు కూడా డాక్టర్ మట్టా దయానంద్ స్పందనను అభినందించారు. ఒక్క సందేశం.. సకాలంలో స్పందన.. విద్యార్థికి అందిన వైద్యం! ఆపదలో ఉన్నవారికి అందించే సాయం మాటల్లో కాదు.. చేతల్లో చూపించాలనే విషయాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- **చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు**



పత్తికొండ నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): నేటి కాలంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను విద్యార్థులు అందిపిచ్చుకొని అభివృద్ధి చెందాలని, చెడు మార్గాల్లో వెళ్లి జీవితాలు పాడు చేసుకోరాదని శాంతి టాలెంట్ హై స్కూల్ వ్యవస్థాపకులు సత్యనారాయణ, ప్యానల్ న్యాయవాదులు సూరజ్ నబి, శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలో జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర జిల్లా న్యాయసవాధికార సంస్థ ఆదేశాల మేరకు సురక్షిత్ బచ్చన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేర్లు గర్వించేలా ముందుకు సాగాలన్నారు. అలాగే ఆడపిల్లల పట్ల మర్యాదగా వ్యవహరించి వారిని గౌరవించాలని లేదంటే ఫోక్సో చట్టం కింద శిక్ష అర్హులవుతారని తెలిపారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి ఉపాధ్యాయుడు నాగరాజు, ఇతర ఉపాధ్యాయులు లోకాదాలత్ క్లర్క్ రాఘవేంద్ర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. గ్రామాభివృద్ధి చేసి చూపిస్తా!

- **వెలమకూరు సర్పంచ్ అభ్యర్థిగా గొల్ల పార్వతి నామినేషన్**



దేవనకొండ నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): దేవనకొండ మండలం వెలమకూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా గొల్ల పార్వతి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడం, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని మద్దతుగా నిలిచిన వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యోగతో మానసిక ప్రశాంతత - ఆరోగ్యం

- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా**

- **59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం**







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్) : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం సౌజన్య మాట్లాడుతూ... గ్రంథాలయం ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. ఎంతోమంది నిరుద్యోగులు పుస్తకాలు కొనుక్కునే పరిస్థితి కూడా లేదని వారికి జిల్లా గ్రంథాలయం పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ చి. మాల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, జె భాస్కర్ రావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ పోటీలను ప్రారంభించిన డాక్టర్. శంకర్ శర్మ



కర్నూలు నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్):జిల్లా స్థాయి పారా స్పోర్ట్స్ పోటీలను ప్రారంభించిన డాక్టర్. శంకర్ శర్మ ప్రారంభించారు. దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్. శంకర్ శర్మ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి పారా స్పోర్ట్స్ ను కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మంగళవారం డాక్టర్ శంకర్ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. డిసెంబర్ మూడవ తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి ప్రోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ దివ్యాంగులు క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగుల్లో దాగివున్న ప్రతిభను వెలుగులోకి తీసుకుని రావడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం కర్నూలు క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి కర్నూలు కు పేరు తీసుకుని రావాలన్నారు. క్రీడల వల్ల శరీరంలో ఎంతో మంచి మార్పులు జరుగుతాయని మంచి హార్మోన్లు విడుదల అవుతాయని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్డీఓ భూపతి రావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి వెంకట పతిరాజు, కోశాధికారి సురేష్ నాయుడు, తెదేపా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు హానుమంతరావు చౌదరి,డిఎస్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో బీజేపీ ఎస్టీ మోర్చా కమిటీ ఏర్పాటు



- **మండల అధ్యక్షుడిగా మాలోత్ బాలాజీ ఏకగ్రీవ ఎన్నిక**

మల్లంపల్లి, నవంబర్ 17 (పి.సి.డబ్ల్యూ న్యూస్): భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఎస్టీ మోర్చా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా మాలోత్ బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా లావుడియా సురేష్, వైస్ ప్రెసిడెంట్‌గా అజ్మీరా సతీష్తో పాటు పలువురు సభ్యులను నియమించారు. నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన సురేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణాకర్ రావు మాట్లాడుతూ రాబోయే ఉత్తర తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తండాలు, గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు.

సిద్దబోయిన సురేందర్ మాట్లాడుతూ గిరిజన యువత బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని, మాలోత్ బాలాజీ నాయకత్వంలో మల్లంపల్లి మండలంలో ఎస్టీ మోర్చాను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దండిగా వెంకన్న, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి అజ్మీరా జగ్గు, కత్తి హరీష్, మండల ఉపాధ్యక్షులు బండి బాబు, కనుకుంట్ల రమేష్, మండల జనరల్ సెక్రటరీ ఎండిగా రాజు, బొమ్మరతి సారన్న, బయ్యా రాజేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె,నవంబర్ 17 (పిసిడబ్ల్యూ న్యూస్): రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.బనగానపల్లె సమీపంలోని కాపులపల్లె ఫాంహౌస్‌లో అవుకు మండల కూటమి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం ఉందని మంత్రి పేర్కొన్నారు. కూటమి పార్టీల నాయకులు వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలని, ప్రతి గ్రామంలో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



పాత్ర కోసం జుట్టు కత్తిరించుకున్న సాయి పల్లవి!


- కొత్త లుక్ చూసి షాకైన తల్లి.. వీడియో కాల్ కట్

- విగ్గు పెట్టుకున్నావా అంటూ ఆరా తీసిన తండ్రి

హైదరాబాద్: సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న హీరోయిన్ సాయి పల్లవి తన కొత్త సినిమా కోసం చేసిన సాహసోపేతమైన మార్పు ఆసక్తికరంగా మారింది. ధనుష్ హీరోగా నటిస్తున్న 'ఓం: చాప్టర్ 1 ఉధిరమ్: ది బ్లడ్ వుడ్' సినిమా కోసం ఆమె తన పొడవాటి జుట్టును కత్తిరించుకున్నారు. అయితే సాయి పల్లవి తీసుకున్న ఈ నిర్ణయం ఆమె తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కొత్త లుక్ చూసిన తల్లి షాక్‌కు గురై వీడియో కాల్ కట్ చేశారట. ఈ విషయాన్ని సాయి పల్లవే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.**పాత్ర కోసం పూర్తిగా మారిపోయా** దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని సాయి పల్లవి తెలిపారు. సినిమాలోని పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందులో ఆమె నిత్యారెడ్డి అనే పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం దర్శకుడు నిజ జీవిత ఐపీఎస్ అధికారి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆమె మాదిరిగా చిన్న జుట్టుతో కనిపించాలనే ఉద్దేశంతో సాయి పల్లవి నిజంగానే జుట్టు కత్తిరించుకున్నారు.**తల్లి షాక్.. తండ్రికి అనుమానం**జుట్టు కత్తిరించుకున్న తర్వాత తన కొత్త రూపాన్ని ముందుగా తల్లికి వీడియో కాల్‌లో చూపించానని సాయి పల్లవి చెప్పారు. తనను ఆ రూపంలో చూసిన తల్లి ఒక్కసారిగా ఆశ్చర్యపోయి ఎందుకు జుట్టు కత్తిరించుకున్నావంటూ ప్రశ్నించారని, ఆ తర్వాత ఫోన్ పెట్టేశారని తెలిపారు. అనంతరం తండ్రి ఫోన్ చేసి, పల్లవి.. అది విగ్గు కదా? అని అడిగారని చెప్పారు. తాను నిజంగానే జుట్టు కత్తిరించుకున్నానని, సినిమా పాత్ర కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించానన్నారు. కొత్త రూపానికి అలవాటు పడటానికి తల్లిదండ్రులకు కొంత సమయం పట్టిందని నవ్వుతూ వెల్లడించారు.

నవంబర్ 20న సినిమా విడుదల రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథలో సాయి పల్లవి పోలీసు అధికారిణిగా కనిపించనున్నారు.

నెట్‌ఫ్లిక్స్‌లో 'రణబాలి' ప్రభంజనం.. విజయ్ నటనకు ప్రేక్షకుల ప్రశంసలు!



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చారిత్రక నేపథ్య యాక్షన్ చిత్రం 'రణబాలి' ఓటీటీలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. థియేటర్లలో విడుదలైన తర్వాత మిశ్రమ స్పందన అందుకున్న ఈ చిత్రం.. నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం మరోసారి వార్తల్లో నిలిచింది. నవంబర్ 13 నుంచి తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమాకు వివిధ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది.**టాప్-10 జాబితాలో రెండో స్థానం** నెట్‌ఫ్లిక్స్ ఇండియా సినిమా విభాగంలో 'రణబాలి' రెండో స్థానానికి చేరినట్లు సినీ వర్గాల కథనాలు వెల్లడించాయి. థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో వీక్షిస్తున్నారు. ముఖ్యంగా హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆసక్తి కనిపిస్తుండటంతో సినిమాకు కొత్త ప్రేక్షకులు చేరుతున్నారు. డిజిటల్ విడుదలతో ఈ చిత్రంపై చర్చ మళ్లీ మొదలైంది. **విజయ్ నటనకు ప్రశంసలు** ఈ సినిమాలో విజయ్ దేవరకొండ చేసిన శారీరక మార్పు, కఠినమైన రూపం, ఆవేశభరితమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పాత్రలోని తీవ్రతను తెరపై చూపించిన తీరు అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని 'గాడ్ సీన్' సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. ఆ సన్నివేశంలో విజయ్ ప్రదర్శించిన నటన, తెరపై ఆయన ఉనికి అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు అభిమానులు స్పందిస్తున్నారు. కొందరు ఆయనకు జాతీయ అవార్డు రావాలని కూడా అభిప్రాయపడుతున్నారు. **రష్మిక నటనపైనా చర్చ** ఈ చిత్రంలో జయమ్మ పాత్రలో నటించిన రష్మిక మందన్నకు కూడా మంచి స్పందన లభిస్తోంది. విజయ్, రష్మికల మధ్య తెరపై కనిపించిన అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ప్రధాన జంట నటనతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. **బ్రిటన్‌లోనూ చర్చకు దారితీసిన కథాంశం** బ్రిటిష్ వలస పాలన కాలంలో జరిగిన ఘటనల నేపథ్యంతో రూపొందిన ఈ సినిమా విదేశీ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షిస్తోంది.

పెళ్లి పీటలెక్కిన 'గద్దలకొండ గణేశ్' హీరోయిన్!

- మలేషియాలో ప్రియుడు మహావిష్ణుతో ఏడడుగులు..

- లంకావి దీవిలో కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహ వేడుక



హైదరాబాద్: తెలుగు ప్రేక్షకులకు 'గద్దలకొండ గణేశ్' సినిమాతో దగ్గరైన హీరోయిన్ మృణాళిని రవి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. మలేషియాకు చెందిన ఆధ్యాత్మిక వక్త మహావిష్ణును ఆమె వివాహం చేసుకున్నారు. నవంబర్ 15న మలేషియాలోని లంకావి దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వీరి వివాహం ఘనంగా జరిగింది.**ఏడేళ్ల స్నేహం.. ప్రేమగా మారి** మృణాళిని, మహావిష్ణు మధ్య గత ఏడేళ్లుగా పరిచయం ఉంది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో ఈ ఏడాది ఆగస్టులో తమ ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఇరు కుటుంబాల అంగీకారంతో నిశ్చితార్థం చేసుకున్నారు. తాజాగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలను మృణాళిని సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.**'గద్దలకొండ గణేశ్'తో గుర్తింపు** సోషల్ మీడియా వీడియోల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న మృణాళిని రవి 2019లో విజయ్ సేతుపతి నటించిన 'సూపర్ డీలక్స్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'గద్దలకొండ గణేశ్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు', 'మామా మశ్చీంద్ర' చిత్రాల్లో నటించారు. తమిళంలో 'ఎనిమీ', 'ఎంజీఆర్ మగన్', 'జాంగో', 'కోబ్రా', 'రోమియో' వంటి సినిమాలతో గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆమె పెళ్లి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ఎన్టీఆర్ అభిమానులకు డబుల్ ధమాకా!



ఒకేసారి రెండు సినిమాలతో తారక్ సందడి.. ప్రశాంత్ నీల్, త్రివిక్రమ్, అనిల్ రావిపూడితో భారీ ప్రాజెక్టులు

హైదరాబాద్: మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు వరుస శుభవార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్న తారక్ మరో క్రేజీ ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన ఆయన, ఆ తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించనున్నారు. ఇదే సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడితోనూ కొత్త సినిమా ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది.**ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్'** ప్రస్తుతం ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' చిత్రం రూపొందుతోంది. భారీ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం విడుదలకు సిద్ధం కానుంది.**త్రివిక్రమ్‌తో 'గాడ్ ఆఫ్ వార్'** 'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు ప్రచారంలో ఉంది. జూలై నుంచి ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ కథా నేపథ్యంతో రూపొందనున్న ఈ చిత్రంపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అయితే సినిమా షూటింగ్ తేదీలు, ఇతర నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.**అనిల్ రావిపూడితో మరో సినిమా** మరోవైపు ఎన్టీఆర్, అనిల్ రావిపూడి కలయికలో సినిమా ఉంటుందని అధికారికంగా ప్రకటించడం అభిమానులకు మరో కానుకగా మారింది. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ తన ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చ సాగుతోంది. మాస్, కామెడీ, కుటుంబ వినోద చిత్రాలతో విజయాలు అందుకున్న అనిల్ రావిపూడి.. ఎన్టీఆర్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.**రెండు సినిమాలు ఒకేసారి చేస్తారా?** త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ చిత్రానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈ మధ్యలో అనిల్ రావిపూడితో ఓ వేగవంతమైన ప్రాజెక్టును పూర్తి చేయాలనే ఆలోచన ఉందని ప్రచారం జరుగుతోంది.

గ్రామీ నామినేషన్లలో 'ధురంధర్'కు నిరాశ!



రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్: ది రివెంజ్ చిత్రానికి 2027 గ్రామీ అవార్డుల్లో నిరాశ ఎదురైంది. ఈ సినిమా నుంచి సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ రూపొందించిన పాటలను ఎనిమిది విభాగాల్లో పరిశీలనకు పంపినప్పటికీ, తుది నామినేషన్లలో ఒక్కదానికి కూడా చోటు దక్కలేదు.'ఫిర్ సే', 'జైయే సజనా', 'జాన్ సే గుజర్తే హై', 'కన్హయ్యా', 'ఆరి ఆరి', 'మన్ అట్మోయా' వంటి పాటలు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. దేశంలో మంచి ఆదరణ పొందిన ఈ పాటలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని చిత్ర బృందం ఆశించినా ఫలితం దక్కలేదు.అయితే, భారతీయ సంగీతానికి గ్రామీ వేదికపై ప్రాతినిధ్యం లభించింది. దేవన్ ఏకాంబరం, సుషా ఆలపించిన తమిళ గీతం 'వరువాయ్' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ విభాగంలో నామినేషన్ సాధించింది. గ్రామీ చరిత్రలో ఓ తమిళ పాటకు నామినేషన్ దక్కడం ఇదే తొలిసారి. 2027 గ్రామీ నామినేషన్లలో బ్రిటిష్ గాయని రే 11 నామినేషన్లతో ముందుండగా, బియాన్స్ తన కెరీర్‌లో 100 గ్రామీ నామినేషన్లు పొందిన తొలి కళాకారిణిగా చరిత్ర సృష్టించింది.